


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం15-07-2022 సంపుటి:03 సంచిక:290 పేజీలు:4 వెల: రూ 3-00


# జల వనరులపై సమీక్ష

అమరావతి: పోలవరం ప్రాజెక్టులో కీలక నిర్మాణాలు.. ముందస్తుగా వచ్చిన వరదల కారణంగా తలెత్తిన పరిణామాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష చేపట్టారు. జల వనరుల శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం సమీక్ష చేపట్టారు. పోలవరం సహా ప్రాధాన్యతా ప్రాజెక్టులపై ఈ సందర్భంగా ఆరా తీశారాయన. పోలవరం ప్రాజెక్టులో కీలక నిర్మాణాలు, ముందస్తు వరదలపై సమగ్ర సమీక్ష. పోలవరం ప్రాజెక్టులో ఈసీఆర్ఎఫ్‌డ్యాం నిర్మాణ ప్రాంతంలో గతంలో ఏర్పడ్డ గ్యాప్?1, గ్యాప్?2లు పూడ్చే పనుల అంశంపై విస్తృత చర్చ. రెండు గ్యాప్‌లను పూడ్చే పనులను నిర్ధారించడానికి 9 రకాల టెస్టులు, నివేదికలు అవసరమన్న అధికారులు. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని, మిగిలిన టెస్టులు పూర్తికావాల్సి ఉందని సీఎం జగన్‌కు తెలిపిన అధికారులు. చేయాల్సిన టెస్టులు, నివేదికలు పూర్తికాకముందే గోదావరి నదికి ముందస్తుగా వచ్చిన వరదల కారణంగా దిగువ కాపర్ డ్యాం ప్రాంతంలోకి వరద నీరు చేరిందని



వివరణ. వరదలు తగ్గాక ఈ పరీక్షలు పూర్తిచేస్తామని సీఎం జగన్‌కు వివరించిన అధికారులు. మరోవైపు షెడ్యూలు ప్రకారం జరుగుతున్న దిగువ కాపర్‌డ్యాం పనులకు కూడా.. ముందస్తు వరదల కారణంగా అంతరాయం. గోదావరిలో వరద కనీసంగా 2 లక్షల క్యూసెక్కులకు తగ్గితేగాని దిగువ కాపర్ డ్యాం ప్రాంతంలో పనులు చేయడానికి అవకాశం ఏర్పడదన్న అధికారులు. వరదలు పూర్తిగా తగ్గితే... ఆగస్టు మొదటివారంలో పనులు తిరిగి ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారుల అంచనా. ఈ పరిస్థితి రాగానే.. ముమ్మరంగా పనులు చేయడానికి అన్నిరకాలుగా సిద్ధం కావాలని అధికార యంత్రాగానికి సీఎం జగన్ సూచన. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం నుంచి రీయింబర్స్ చేయాల్సిన మొత్తం రూ.2,900 కోట్లని, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో ఈ ఖర్చు చేసిందని సీఎం జగన్, అధికారులతో ప్రస్తావించారు. పోలవరం ప్రాజెకులో జరుగుతున్న పనులను వేగవంతంగా చేయడానికి అడహాక్‌గా రూ.6వేల కోట్ల నిధులను కేంద్రం నుంచి రప్పించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం. కాంపొనెంట్ వైజ్‌గా రీయింబర్స్ చేసే విధానంలో కాకుండా.. అడహాక్‌గా డబ్బులు తెప్పించుకుంటే..., ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పనులను త్వరితగతిన ముందుకు కొనసాగించవచ్చని అధికారులకు ఆయన సూచించారు. వరద తగ్గగానే ఈ పనులు శరవేగంతో చేయడానికి ఈ డబ్బు ఉపయోగపడుతుందని తెలిపారాయన. ఈమేరకు అడహాక్‌గా కేంద్రం నుంచి నిధులు తెప్పించుకునే అంశంపై దృష్టిపెట్టాలని, కేంద్రానికి లేఖలు కూడా రాయాలని సీఎం జగన్ తెలిపారు. పోలవరం కుడి, ఎడమ కాల్వలకు సంబంధించి హెడ్ వర్క్స్, కనెక్టివిటీ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సీఎం జగన్ సూచన. ఆగస్టు మూడోవారంలో నెల్లూరు బ్యారేజీ, మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజీల ప్రారంభోత్సవానికి సిద్ధం చేశామని అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. బ్యారేజీపై పెట్టాల్సిన దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి విగ్రహం కోసం ఎదురుచూస్తున్నామని, అది కూడా త్వరలో చేరుకుంటుందని వెల్లడించారు. అలాగే.. దసరా నాటికి టన్నెల్?2 సిద్ధం చేయాలని సీఎం ఆదేశాలు. ఏప్రిల్‌లో 387.3 మీటర్లు, మేలో 278.5 మీటర్లు, జూన్‌లో 346.6 మీటర్లు, జులైలో

## వరద తగ్గాక పోలవరం పనులు వేగవంతం చేయాలి: సీఎం జగన్

ఇప్పటివరకూ 137.5 మీటర్ల పనులు చేశామన్న అధికారులు. నెలవారీగా కార్యాచరణ సిద్ధంచేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని సీఎం జగన్ స్పష్టీకరణ. వంశధార ప్రాజెక్టు స్టేజ్?2 ఫేజ్?2 పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయని, అక్టోబరులో ప్రారంభోత్సవానికి సిద్ధంచేస్తామన్న అధికారులు. అదే సమయంలో గొట్టా బ్యారేజీ నుంచి హిరమండలంకు నీరందించే ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన కార్యక్రమం చేపడతామని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, మహేంద్రతనయ, తారకరామతీర్థసాగర్, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, రాయలసీమలోని జొలదరాశి,రాజోలిబండ, కుందూ లిఫ్ట్, వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు, వీటితోపాటు చింతలపూడి, వైయస్సార్ పల్నాడు, మడకశిర బైపాస్ కెనాల్, భైరవానితిప్ప, వరికెశెలపూడి కలుపుకుని మొత్తం 27 ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయడానికి లక్ష్యాలను సీఎం జగన్ నిర్దేశించారు. దశాబ్దాల తరబడి పశ్చిమ కర్నూలు ప్రాంతం బాగా వెనకబడి ఉంది. పరంగా అత్యంత వెనకబడ్డ ప్రాంతం ఇదే. దశాబ్దాలుగా ఇక్కడ నుంచి కొనసాగుతున్న వలసలను నివారించడానికి కార్యాచరణ సిద్ధంచేయాలి. భూమిలేని వారికి కనీసం ఒక ఎకరా భూమినైనా ఇవ్వాలి. ఈ ప్రాంతంలో ఇరిగేషన్, తాగునీటి పథకాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలి. దీనివల్ల ప్రజలకు వ్యాపకం దొరుకుతుంది, వలసలను నివారించగలుగుతాం. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కాలేజీలు తదితర విద్యాసంస్థల పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధంచేయాలి. ఈ ప్రాంతంలో ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. జల వనరులపై చేపట్టిన సమీక్షా సమావేశంలో జలవనరులశాఖమంత్రి అంబటి రాంబాబు, సీఎస్ సమీర్ శర్మ, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ ఎస్ రావత్, ఈఎన్‌సీ సి నారాయణరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గోదావరి వరద ప్రాంతాల్లో సీఎం జగన్ ఏరియల్ సర్వే



అమరావతి: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు(జులై 15, శుక్రవారం) మధ్యాహ్నం ఏరియల్ సర్వే చేపట్టనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే సీఎం జగన్.. అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. గురువారం చేపట్టిన ఇరిగేషన్ రివ్యూ సందర్భంగా.. ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగం అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అదే సమయంలో గోదావరి వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారుల నుంచి సీఎం జగన్.. వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. రాబోయే 48 గంటల్లో వరదనీరు ఇంకా పోటెత్తే అవకాశం ఉందని సమీక్షా సమావేశంలో అధికారులు, సీఎం జగన్‌కు తెలిపారు. ఎగువన తెలంగాణలో గోదావరి నదిపై ఉన్న శ్రీరాంసాగర్‌సహా బేసిన్‌లో ఉన్న అన్ని రిజర్వాయర్ల నుంచి కూడా భారీ వరదనీరు విడుదలవుతోంది. దాదాపు 24 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చే అవకాశం ఉందని సీఎం జగన్‌కు అధికారులు వెల్లడించారు. దీంతో పోలవరం, ధవళేశ్వరం వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ.. దిగువ ప్రాంతాలను అప్రమత్తం చేయాలని సీఎం జగన్ సూచించారు. వరదల కారణంగా ఉత్పన్నమవుతున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించిన సీఎం జగన్.. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారికి తగిన సౌకర్యాలను కల్పిస్తూ సహాయశిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కౌలు రైతులకు వైసీపీ సరైన న్యాయం చేయడం లేదు:నాదెండ్ల

కాకినాడ: కౌలు రైతులకు వైసీపీ(జఅఖ) సరైన న్యాయం చేయడం లేదని జనసేన నేత నాదెండ్ల మనోహం విమర్శించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... కౌలు రైతుల ఆత్మహత్యలపై వైసీపీ నాయకులు హేళనగా మాట్లాడుతున్నారన్నారు. రైతుల కష్టాలపై సరైన తీరులో ముఖ్యమంత్రి స్పందించడం లేదని ప్రజలకు అర్థమైందని తెలిపారు. ఆత్మహత్యలు చేసుకున్నవారు రైతులే కాదని వారిని అవమానవరుస్తున్నారని మండిపడ్డారు. ఎనిమిది వందల మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు సర్కార్ అంగీకరించిందని...వారందరికీ ఏడు లక్షల రూపాయలు చొప్పున ఇచ్చారా అని ప్రశ్నించారు.

# ఏపీలో భారీ వర్షాలు..

## నీట మునిగిన చింతూరు ఏజెన్సీ



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా గత ఆరు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో నదులు, వంకలు, కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. గోదావరి నదికి ఇన్ ఫ్లో పెరగడంతో సాగునీటి ప్రాజెక్టులు నిండిపోయాయి. వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏజన్సీ కూనవరం గ్రామం భారీ వర్షాలకు వరద నీటితో ముంపునకు గురైంది. ప్రభుత్వ సాయం కోసం ఏజెన్సీ వాసులు ఎదురుచూస్తున్నారు. ఇలాఉండగా, ఏపీలో మరో 24 గంటల పాటు వానలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలో వానలు, వరదలు ముంచెత్తుతున్నాయి. అన్ని జిల్లాల్లో జోరుగా వర్షం కురుస్తున్నది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో అక్కడి ప్రజలను ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భారీ వరదల కారణంగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిండిపోయాయి. అల్పపీడన ప్రభావంతో బుధవారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. కాకినాడ, అల్లూరి జిల్లాల్లో బుధవారం భారీ వర్షం కురవగా.. నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. మత్స్యకారులు ఈ నెల 16 వరకు చేపల వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. శుక్రవారం నుంచి రెండు, మూడు రోజుల పాటు ఏపీలో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నది. ఇలాఉండగా, ఏజెన్సీలోని చింతూరు గ్రామం పూర్తిగా జలదిగ్బంధనంలో చిక్కుకుపోయింది. ఇంట్లోని సరుకులను తీసుకుని చెట్ల కింద వంటలు చేసుకుంటున్నారు. తాగడానికి నీరు కరవై ఇబ్బందిపడుతున్నారు. వరదలతో తమ గ్రామం నీటిలో మునిగిపోగా, తమను ఆదుకునేందుకు ఒక్కరు కూడా రావడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను రక్షించేందుకు పోలీసులు, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ ఎవరూ రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. వర్షాలు పెరిగే అవకాశం ఉన్నందున తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వేడుకున్నారు.

# తెలంగాణకు వాతావరణ శాఖ హెచ్చరిక..

## భద్రాచలంలో 144 సెక్షన్ విధింపు

హైదరాబాద్: తెలంగాణకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు అతిభారీ వర్ష సూచన ఉందని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు అతిభారీ వర్షాల ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. అంతేకాదు ఐదు జిల్లాలకు వరద ముప్పు పొంచి ఉందని తెలిపింది.



మరో మూడు రోజుల పాటు వర్షాల ప్రభావం ఉండడంతో.. మిగతా చోట్ల సైతం సాధారణం నుంచి వర్షాలు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అరుదుగా వరదలొచ్చే నదులు పొంగిపొర్లడంతో మూకుమ్మడిగా గోదావరి నదికి వరద పోటెత్తుతోంది. ప్రాణహిత, పెన్‌గంగా, వార్ధా నదులు వరదలతో ఉగ్రంగా ప్రవహిస్తున్నాయి. శ్రీరాంసాగర్, కడెం నుంచి దిగువకు భారీగా వరద నీరు విడుదల అవుతోంది. భూపాలపల్లి జిల్లాలో గోదావరి ఉధృతి అంతకంతకు పెరుగుతోంది. పలిమెల పోలీస్ స్టేషన్ నీట మునిగింది. మేడిగడ్డ కంట్రోల్ రూంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు కొందరు జలదిగ్బంధంలో చిక్కుకున్నట్లు సమాచారం. అలాగే భద్రాద్రికి రాకపోకలు బంద్ అయ్యాయి. మిగిలిన ఏకైక మార్గం కూడా మూసివేశారు అధికారులు. అత్యవసరమైతేనే భద్రాద్రిలోకి అనుమతిస్తున్నారు. భద్రాచలం బ్రిడ్జిపై 48 గంటల పాటు రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలంలో 144 సెక్షన్ విధించారు. 48 గంటలపాటు ప్రజలెవరూ బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం 62 అడుగుల వద్ద ఉన్న నీటి మట్టం.. రాత్రికి లేదంటే రేపు ఉదయానికి గోదావరి మట్టం 70 అడుగులకు చేరొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి జిల్లాలు డేంజర్ జోన్లో ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. సీఎస్ సోమేశ్‌కుమార్ అధికారులతో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఏపీలోనూ..

రాజమండ్రి: ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ఉధృతంగా ఉంది. నీటిమట్టం 16 అడుగులు దాటింది. 17.75 అడుగులు దాటితే మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. అదే జరిగితే ఆరు జిల్లాలపై ప్రభావం పడనుంది. 42 మండలాల్లోని 524 గ్రామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పోలవరం నుంచి ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ముంపులోకి మరికొన్ని ప్రాంతాలు. ఆచంట, యలంచిలి మండలాల్లో లంకగ్రామాలు నీట మునగ్గా.. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద సహాయక చర్యల్లో ఏడు ఎన్‌డీఆర్ఎఫ్, ఐదు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొంటున్నాయి. స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి ఏపీ విపత్తుల శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# మోదీ వైఫల్యాలకు అద్దం పట్టే పదాలు ఇప్పుడు అన్‌పార్లమెంటరీ : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : జుమ్లా, కొవిడ్ స్ప్రెడర్, కరప్ట్ వంటి పలు పదాలను అన్‌పార్లమెంటరీగా పరిగణిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ చర్చలోకి ఎంటరై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ప్రధాని నరేంద్ర మోదీ పాలనను సరైన రీతిలో ఎండగడుతూ చేసే వ్యాఖ్యలు ఇప్పుడు అన్‌పార్లమెంటరీ పదాలుగా మారాయని, వీటిని మాట్లాడకుండా నిషేధించారని రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌కు రాహుల్ గాంధీ న్యూ డిక్షనరీ ఫర్ న్యూ ఇండియా అనే క్యాప్షన్ ఇచ్చారు. జుమ్లా జీవి, కొవిడ్ స్ప్రెడర్, స్నూప్‌గేట్‌తో పాటు తరచూ వాడే సిగ్గుచేటు, వేధింపులు, బూటకం, డ్రామా, హిపోక్రసీ, అసమర్థత అని అర్థం ధ్వనించే పదాలను కూడా లోక్‌సభ, రాజ్యసభలో అన్‌పార్లమెంటరీగా పేర్కొంటూ లోక్‌సభ సెక్రటేరియట్ బుక్‌లెట్‌ను విడుదల చేసింది. ఈ పదాలను అన్‌పార్లమెంటరీ జాబితాలో ప్రస్తావించడం పట్ల టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ పదాలను తాను వాడతానని, దమ్ముంటే స్పీకర్ తనను సస్పెండ్ చేయాలని ఆయన సవాల్ విసిరారు.

# వరద బాధితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిద్రపోతోంది: చంద్రబాబు



అమరావతి: వరద బాధితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిద్రపోతోందని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలను హెచ్చరించే వ్యవస్థలను.. వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని దుయ్యబట్టారు. పాలకుల అలసత్వంతో వరద బాధితులు అల్లాడుతున్నారని తెలిపారు. వరద బాధితులకు అండగా ఉంటూ సాయం చేయాలని టీడీపీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ విమర్శలు మాని ప్రజలు ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని చంద్రబాబు ప్రకటించారు.


# సంపాదకీయం

శుక్రవారం 15-07-2022

## సంక్షేమం గీత దాటితే సంక్షోభమే,

శ్రీ లంకలో తలెత్తిన తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో చెలరేగిన ప్రజాందోళనలు, హింసాత్మక సంఘటనలపై మన దేశంలో చాలా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అమలవుతున్న సంక్షేమ పథకాల విషయంపై విభిన్న కోణాలలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. అధికార పీఠాన్ని అందుకునేందుకు, రాజకీయ పార్టీలు సంక్షేమ పథకాలు, ఉచిత వరాలను నిచ్చెనలుగా చేసుకుని, అధికారానికి అడ్డ దారిగా, దగ్గరి దారి (షార్ట్ కట్ ) గా చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఆర్థిక క్రమశిక్షణ గాడి తప్పుతోందనే వాదన బలాన్ని పుంజుకుంటోంది. నిజమే. సంక్షేమం గీత దాటితే సంక్షోభం తప్పదని ఆర్థిక నిపుణులు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నారు. అయినా, రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో, ప్రభుత్వాలు, 'ఓటు బ్యాంక్' పథకాలకు పెద్ద పీట వేస్తున్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నాయి. మీటలు నొక్కి ఓట్లు దండుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాయి. అందుకే ఇటీవల ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, నొక్కిన మీటల లెక్కలు చెప్పి, మొత్తం 175 సీట్లు తమవే అన్న ధీమాను వ్యక్తపరిచారు. ఇలా ప్రజలను ఓటర్లుగా, ఓటర్లను అమ్ముడుపోయే సరుకుగా భావించి అప్పులు చేసి మరీ సంక్షేమ పథకాలను అమలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా రాష్ట్రాలు అప్పుల్లో కూరుకు పోవడంతో పాటుగా, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దిగజారుతోంది. అలాగే, అప్పుల భారం పెరిగే కొద్దీ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయలేక పోతున్నాయి. కోతలు విధిస్తున్నాయి. చేతులేత్తేస్తున్నాయి. మరో వంక అభివృద్ధి, దీర్ఘకాల సుస్థిర ప్రయోజనాలపై ప్రభుత్వాలు దృష్టి నిలపలేక పోతున్నాయి. శ్రీ లంకలో జరిగింది అదే. అందుకే మన దేశంలోనూ శ్రీ లంక తరహా పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఘటికలు వినిపిస్తున్నాయని హెచ్చరికలు వినవస్తున్నాయి. షార్ట్ కట్ రాజకీయాలు, దేశానికి అతిపెద్ద సవాలుగా మారాయని ప్రధాన మంత్రి నరేద్ర మోడీ చేసిన వ్యాఖ్యాలు ఇప్పుడు దేశంలో ప్రధాన చర్చనీయంశాలు అయ్యాయి. ప్రధాన మంత్రి మోడీ, ప్రత్యేకించి ఏ ఒక్కరినో ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయక పోయినా, షార్ట్ కట్ రాజకీయాలపై ఆధారపడితే, షార్ట్ సర్క్యూట్ ఖాయమని చేసిన హెచ్చరిక మాత్రం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ సహా అందరికీ వర్తిస్తుందని ఆర్థిక రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులు అంటున్నారు. ఝార్ఖండ్లోని దేవ్గఢ్లో రూ.16,800 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన తర్వాత నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు ఏపీ, తెలంగాణ స్టేట్ గవర్నమెంట్స్' సీరియస్'గా తీసుకోవాలని అంటున్నారు. ప్రధాని మోడీ ఎక్కడా ఎవరి పేరూ ప్రస్తావించక పోయినా, ఓట్ల కోసం అమలు చేసే ప్రజాకర్షక పథకాలు దేశాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. అలాంటి పథకాలు ప్రకటించడాన్ని షార్ట్ కట్ రాజకీయాలుగా అభివర్ణించారు. వీటిపై ఆధారపడితే షార్ట్ సర్క్యూట్ తప్పదని స్పష్టం చేశారు.. షార్ట్ కట్ రాజకీయంతో దేశమే ధ్వంసం అవుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి.. మనమంతా కఠోర శ్రమతో నవభారత్ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలి. ప్రజాకర్షక పథకాలతో ఓట్లు సంపాదించడం సులువే. కానీ.. అలాంటి షార్ట్ కట్లు అవలంబిస్తే దీర్ఘకాలిక దుష్పరిణామాలు ఉంటాయి" అని హెచ్చరించారు. నిజానికి ప్రధాని మోడీ ప్రభుత్వం గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితి గతులు, అప్పులు ఆదాయాలపై దృష్టిని కేంద్రీకరించింది. ముఖ్యంగా, ఎఫ్ఆర్బీఎం నిబంధనలు ఉల్లంఘించి, కార్పొరేషన్ల పేరిట అడ్డదారిలో చేస్తున్న అప్పులకు సంకెళ్ళు బిగించేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా అప్పులు చేయకుండా రాష్ట్రాల రుణ పరిమితిని ఎప్పటికప్పుడు సమీక్షించే వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయితే, కేంద్రం తీసుకున్న కఠిన చర్యలు సహజంగానే రాష్ట్ర ప్రభుత్వాలకు రుచించడం లేదు. అయితే, ఆర్థిక నిపుణులు, చివరకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారులు కూడా, దీర్ఘకాల ప్రయోజనాలు, సుస్థిర అభివృద్ధి సాధించాలంటే, ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరని, బెల్ట్ బిగించిక తప్పదని అంటున్నారు. అలాగే, శ్రీ లంక పరిణామాల నేపథ్యంలో, ప్రజలు కూడా, సంక్షేమం గీతదాటితే సంక్షోభమే, అనే వాస్తవాన్ని గుర్తిస్తున్నారని అంటున్నారు. ఒక విధంగా శ్రీ లంక పరిణామాలను ఒక గుణపాఠంగా తీసుకోవాలని అంటున్నారు.

# టీడీపికి ఆగస్టు తర్వాత...



విజయవాడ, జూలై 14, చంద్రబాబు తెలివైన నేత. భవిష్యత్ ను పసిగట్టగలిగిన లీడర్. కానీ ఇటీవల కాలంలో ఆయన అనుకున్నవేమీ జరగడం లేదు. ఆగస్టు నెల నుంచి ఆయనకు మరింత ఇబ్బందులు ఎదురుకానున్నాయి. వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతి పదవి నుంచి తప్పుకోనున్నారు. ఇక ఢిల్లీలో తమ తరుపున లాబీయింగ్ చే?సే వాళ్లు కూడా ఎవరూ చంద్రబాబుకు దొరకరు. ఢిల్లీ స్థాయిలో బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ఒప్పించగలవారు ఎవరూ లేరు. గతంలో చంద్రబాబుకు ఢిల్లీలో లాబీయింగ్ చేసే వారు అనేక మంది ఉండేవారు. కానీ ఇప్పుడు ఢిల్లీలో చంద్రబాబుకు దారి దొరకడం లేదు. గత ఎన్నికల్లో బీజేపీ అగ్రనేతలపై వ్యక్తిగత దూషణలకు దిగడంతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ కు మద్దతిచ్చినందుకు కేంద్ర నాయకత్వం కోపం ఇంకా చల్లారలేదు. చంద్రబాబు మాత్రం కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో భవిష్యత్ లేదని భావించి మళ్లీ బీజేపీకి దగ్గరవ్వాలని ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీకి ఒకసారి వెళ్లి అపాయింట్ మెంట్ దొరకక వెను దిరిగి వచ్చారు. మరోసారి ఆ ప్రయత్నం ఇప్పటి వరకూ చేయలేదు. అదే జరిగి ఉంటే... వెంకయ్యనాయుడుకు పదోన్నతి వచ్చి రాష్ట్రపతి అయి ఉంటే చంద్రబాబుకు ఢిల్లీలో అండ దొరికేది. భరోసా లభించేది. కానీ వెంకయ్య నాయుడు రాష్ట్రపతి పదవి దక్కకపోవడంతో ఉప రాష్ట్రపతి పదవిలో కూడా కంటిన్యూ అయ్యేందుకు ఇష్టపడటం లేదు. ఆయన రాజకీయంగా రిటైర్ మెంట్ అవ్వాలని నిర్ణయించుకున్నారు. వెంకయ్య నాయుడు వివాదం లేని రాజకీయ నేత. కానీ ఆయన తొలి నుంచి తెలుగుదేశం పార్టీకి అనుకూలం అన్న ముద్ర ఉంది. ఎన్టీఆర్ హయాం నుంచే వెంకయ్య నాయుడు టీడీపీకి మద్దతుదారుగా ఉండేవారు. ఆయన వల్లనే బీజేపీ ఏపీలో ఎదగలేదని ఆ పార్టీ నేతలే ఉప రాష్ట్రపతి కానంతవరకూ బహిరంగంగానే విమర్శలు చేసేవారు. వెంకయ్య ఉపరాష్ట్రపతి పదవి నుంచి ఆగస్టులో తప్పుకోనున్నారు.అనంతరం ఆయన ఢిల్లీ వదలి వస్తారు. బీజేపీ అగ్రనాయకత్వంతోనూ ఆయన ఇక టచ్ లో ఉండక పోవచ్చు. మరో వైపు రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలు కొందరు చంద్రబాబుకు మద్దతుగా నిలుస్తున్నా కేంద్ర నాయకత్వాన్ని ప్రభావం చేయగల నేతలు కాదు. పైగా ఇప్పుడు చంద్రబాబుకు బలం లేదు. బలగం లేదు. అందుకే బీజేపీ ఆయనను అడగకపోయినా రాష్ట్రపతి అభ్యర్థి ముర్ముకు మద్దతు ప్రకటించి ఉండవచ్చుంటున్నారు. భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు ఢిల్లీ నుంచి ఎదురు కాకుండా ఉండేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చు. ముందుగానే ప్రకటించి ఉంటే ఇన్ని అనుమానాలు వచ్చేవి కావు. చివరి నిమిషంలో మద్దతు ప్రకటించడంతోనే ఢిల్లీ డౌట్లు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలోనూ చంద్రబాబు నిర్ణయం ఎన్డీఏ వైపు ఉంటుంది. అందులో ఏమాత్రం సందేహం లేదు.

# భారీగా పెరుగుతున్న అక్రమ మద్య ఆదాయం

విజయవాడ, జూలై 14, ఏపీ మద్యం పాలసీలో వింత పోకడలకు పోతున్నారు. మద్యపాన నిషేధం గురించి ఉపన్యాసాలు ఇచ్చి తన స్వంత జె బ్రాండ్‌తో జనానికి మత్తెక్కించే విధానాన్ని అవలంబిస్తున్నారు.మత్తెక్కించడమే కాదు.. జనం జేబులు గుల్ల చేసి మరీ వారికి అనారోగ్యాన్ని బోనస్ గా ఇస్తున్నారు. అందరికీ అందుబాటులో వుండే ధరల్లో అందిస్తున్నామంటున్న మద్యంలో రసాయనాలు అనారోగ్య హేతువుగా మారి ప్రాణాంతకంగా మారాయని విమర్శలు రాష్ట్రమంతటా వెల్లువెత్తుతున్నాయి. పైగా, జబ్బులు, అనారోగ్యాలు జనాలకి, అమ్మకాలపై పన్ను సొమ్ము జగన్‌కి వెళుతోంది. ఈ అమ్మకాలపై ముప్ఫయి శాతం సాధారణ ఎక్సైజ్ పన్ను రూపేణా జగన్ జేబుల్లోకి అక్రమ మద్యం ఆదాయం వెళ్తోంది. కాబట్టే డిజిటల్ లావాదేవీలు పెట్టలేదని విపక్షాలు మండిపడుతున్నాయి.అయినా జగన్ పాలసీయే వేరు. అందులో మద్యం పాలసీ వెరీ స్పెషల్. జమా ఖర్చులు ఎందుకు జేబు నిండితే చాలన్నట్లుగా జగన్ మద్యం పాలసీ ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నా సీఎం పెడ చెవిన పెడుతున్నారు. మద్యపానం నిషేధించాలని గట్టి నిర్ణయం తీసుకున్నవారే మద్యం నుంచి వచ్చే ఆదాయాన్ని కోరుకుం టూ తమ తరఫున ప్రత్యేక బ్రాండ్లను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి ప్రత్యేక అమ్మకాలు, దుకాణాలవల్ల ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతింటోందన్న విమర్శలు రాష్ట్ర మంతటా వినవస్తు న్నాయి. ఈ అమ్మకాలపై ముప్ఫయి శాతం సాధారణ ఎక్సైజ్ పన్ను రూపేణా జగన్ జేబుల్లోకి అక్రమ మద్యం ఆదా యం వెళ్తోంది. కాబట్టే డిజిటల్ లావాదేవీలు పెట్టలేదని విపక్షాలు మండిపడుతున్నాయి. మద్యం ఆదాయ కుంభకోణంపై సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని టీడీపీ నేత డోలా బాల వీరాం జనేయ స్వామి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 30 శాతం సాధారణ ఎక్సైజ్ పన్ను రూపేణా జగన్ జేబుల్లోకి అక్రమ మద్యం ఆదాయం వెళ్తోంది కాబట్టే డిజిటల్ లావాదేవీలు పెట్ట లేదన్నారు.మద్యంలో విషపూరిత రసాయనాలు ఉన్నాయని తాము నివేదికలు విడుదల చేస్తే ప్రభుత్వం ఎందుకు విచారణ జరిపించట్లేదని ప్రశ్నించారు. అవసరం అయితే రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. వైసీపీ సర్కారు వచ్చిన తరువాతే రాష్ట్రంలో 106 మద్యం బ్రాండ్స్ వచ్చాయని డోలా బాలవీరాంజనేయ స్వామి ఆరోపించారు. ఇదిలా వుండగా, కొత్త బార్ పాలసీ ద్వారా 800 బార్‌లకు రెండేళ్లు అనుమతించిన జగన్ రెడ్డి మద్య నిషేధం ఎలా చేస్తారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ప్రశ్నించారు. బుధవారం మీడియా తో మాట్లాడుతూ, మద్యంలో విష రసాయనాలు ఉన్నాయని తాము బయటపెట్టిన నివేదికపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.మద్యం తయారు చేయించేది జగన్, ప్యాపారం చేయించేది ప్రభుత్వం, అమ్మేది వైకాపా కార్యకర్తలు అని ఆరోపించారు. ముఖ్యమంత్రే మద్యం వ్యాపారం చేయటం ప్రజలు చేసుకున్న దుర దృష్టమన్నారు. ఎంపిక చేసుకున్న కొంతమంది బినామీలతో మద్యం వ్యాపారం చేయిస్తూ, ఆ డబ్బునే తిరిగి ఎన్నికల్లో ఖర్చు చేయనున్నారని తెలిపారు. మొబైల్ బెల్టుషాపులు పెట్టి మరీ మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశం మొత్తానికి మాదకద్రవ్యాల సరఫరా ఏపీ నుంచే జరుగుతోందన్నారు. వాటాల్లో తేడా లొచ్చేయి గనుకే కేసులు బయటకు వస్తున్నాయని ఏలూరు సాంబశివరావు పేర్కొన్నారు.

# రాజమండ్రిలో ఎత్తులు పొత్తులు

రాజమండ్రి, జూలై 14, కొద్దిరోజులుగా రాజమండ్రి రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి. వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య మాటల యుద్ధం ఓ రేంజ్‌లో జరుగుతోంది. ముఖ్యంగా వైసీపీ ఎంపీ మార్గాని భరత్.. టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాసుల మధ్య ఉప్పు నిప్పులా మారుతున్నాయి రాజకీయాలు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఇద్దరే రాజమండ్రి అర్బన్ బరిలోకి దిగుతారనే ప్రచారం కూడా మొదలైపోయింది. దానికి తగ్గట్టుగా రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నారనే వాదన స్థానికంగా వినిపిస్తోంది. ప్రధాన పార్టీలు వీరికే టికెట్లు ఇస్తాయన్న గ్యారెంటీ లేకపోయినా.. నాయకులు మాత్రం పక్కా ప్లాన్‌తో లోకల్ పాలిటిక్స్‌ను వేడెక్కిస్తున్నారు.రాజమండ్రి అసెంబ్లీ పరిధిలో నిర్వహించిన వైసీపీ ప్లీనరీలో ఎంపీ భరత్ కొన్ని సంచలన కామెంట్స్ చేశారు. టీడీపీలో కీలకంగా ఉన్న ఆదిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మాటల తూటాలు పేల్చారాయన. పైగా రాజమండ్రిని తన అడ్డాగా చెప్పుకొచ్చారు భరత్. ఈ వ్యాఖ్యలకు వేగంగానే బదులిచ్చారు ఆదిరెడ్డి వాసు. కేవలం ప్రతి విమర్శలతో సరిపెడితే బాగోదని అనుకున్నారో ఏమో.. భరత్‌కు ఓ సవాల్ విసిరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని.. వైసీపీ నుంచి భరత్ బరిలో ఉంటే రాజమండ్రి ఎవరి అడ్డానో తేలిపోతుందని సవాల్ చేశారు వాసు. ఆ తర్వాత ఈ మాటల యుద్ధం మరో మలుపు తిరిగింది. రెండు పార్టీలకు చెందిన కింది స్థాయి కార్యకర్తలు కూడా సవాళ్లు చేసేసుకుంటున్నారు.వాస్తవానికి ఎంపీ భరత్ మూడేళ్లుగా స్థానిక టి.డి.పి. నేతలపై విమర్శలు చేయలేదు. రాజమండ్రి సిటీ? రాజమండ్రి రూరల్ నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ వారి గురించి మాట్లాడిన సందర్భాలు తక్కువే. అలాంటిది సడెన్‌గా నియోజవర్గ ప్లీనరీలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబాన్ని ఎంపీ లక్ష్యంగా చేసుకోవడం చర్చగా మారింది. ఈ ఘటనకు కొద్దిరోజుల ముందే టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఓ ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో తన బదులు తన భర్త వాసు బరిలో ఉంటారని చెప్పారామె. ఆ తర్వాతే క్రమంగా రాజకీయ వేడి రాజుకుంటోంది.రాజమండ్రి అర్బన్‌లో ప్రస్తుతం వైసీపీ కోఆర్డినేటర్ పోస్ట్ ఖాళీగాఉంది. కొత్తగా ఎవరిని నియమిస్తారో కేడర్‌కే తెలియడం లేదట. దీంతో వచ్చే ఎన్నికల్లో ఎంపీగా కాకుండా ఎమ్మెల్యేగా బరిలో దిగితే ఎలా ఉంటుందో అని భరత్ లెక్కలేస్తున్నారట. ఎప్పుడూ లేనంతగా రాజమండ్రిపై ఎక్కువ ఫోకస్ పెడుతున్నట్టు సమాచారం. అందుకే సిటీ టీడీపీలో కీలకంగా ఉన్న ఆదిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు చెబుతున్నారు. అయితే అసెంబ్లీ బరిలో ఈ ఇద్దరి పోటీకి ఆయా పార్టీలో అంగీకరిస్తాయా అనేది మరో ప్రశ్న. రాజమండ్రి టీడీపీలో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి, ఆదిరెడ్డి కుటుంబానికి పడటం లేదు. సిటీ సీటుపై గోరంట్ల కూడా కన్నేశారు. ఇక ఎంపీ భరత్ విషయానికి వస్తే.. ఆయన్ని అసెంబ్లీ బరిలో దించే సాహసం చేస్తారా అనే అనుమానాలు ఉన్నాయట. గత రెండు ఎన్నికల్లో బీసీలకు టికెట్ ఇచ్చినా వైసీపీకి గెలుపు దక్కలేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఓసీకి ఛాన్స్ ఇస్తారనే చర్చ పార్టీ వర్గాల్లో ఉంది. దీంతో భరత్ పోటీపై పార్టీ వర్గాలే సందేహాలు వ్యక్తం చేసే పరిస్థితి. క్షేత్రస్థాయిలో వైసీపీ, టీడీపీలో జరుగుతున్న చర్చ ఇదైతే.. అవేమీ పట్టనట్టు భరత్, వాసులు ప్రకటనలు చేసేస్తున్నారు. మరి.. రాజమండ్రిలో ఏం జరుగుతుందో చూడాలి.

# అక్కరకు వచ్చిన పోలవరం



ఏలూరు, జూలై 14, ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. కానీ దానిని సత్వరమే పూర్తి చేయడానికి గత ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పనులను పరుగులు పెట్టించారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన పోలవరం ప్రాజెక్టు పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాకా నత్తనడకన సాగుతున్నాయి. అయితే గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టు స్పిల్ వే గేట్ల పనులు పూర్తయ్యాయి. ఆ ఫలితం ఇప్పుడు తెలిసింది. చంద్రబాబు దార్శనికత ఫలితం రాష్ట్ర ప్రజలకు మరో సారి అర్థమైంది. వరదనీటి విడుదల స్పిల్ వే వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. ప్రాజెక్టు గేట్లను హైడ్రాలిక్ పద్ధతిలో పనిచేసే విధంగా అమర్చారు. ఈ స్పిల్ వేలోని 48 హైడ్రాలిక్ గేట్లు తొలిసారిగా పూర్తిగా వినియోగంలోకి వచ్చాయి. అకస్మాత్తుగా వచ్చిన వరదను నియంత్రించే విధంగా ఏర్పాటు చేసిన పోలవరం ప్రాజెక్టు గేట్లు విజయవంతంగా అన్నీ ఒకేసారి అతి తక్కువ సమయంలోనే 15 లక్షల క్యూసెక్కుల నీటిని స్పిల్ చానెల్ మీదుగా గోదావరి నది దిగువకు విడుదల చేశాయి.ప్రాజెక్టులోని మొత్తం 48 గేట్లను ఏకకాలంలో ఎత్తడం ద్వారా వాటి పని తీరు సమర్థంగా ఉందని నిరూపించడంతో పాటు వరదనీటిని సులువుగా 6 కిలోమీటర్ల మేర అప్రోచ్ ఛానెల్, స్పిల్ వే, స్పిల్ ఛానెల్, పైలెట్ ఛానెల్ మీదుగా గోదావరిలోకి విడుదల చేయడంలో గేట్లు కీలకపాత్ర వహించాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ వర్షాకాల సీజన్ మొదట్లోనే గోదావరి నదికి భారీ ఎత్తున వరదలు వస్తున్నాయి.గోదావరి నదికి ఇలా పెద్ద ఎత్తున వరదలు రావడం వందేళ్ళ చరిత్రలో ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఎగువ నుండి వచ్చే భారీ వరదలను తట్టుకోవడానికి పోలవరం ప్రాజెక్టును అధికారులు ముందుగానే సిద్ధంగా ఉంచారు. స్పిల్ వే నుండి వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు.వందేళ్ళ చరిత్రను ఆధారం చేసుకుని పోలవరం స్పిల్ వేను, గేట్లను డిజైన్ చేశారు. వందేళ్ళలో గోదావరికి 36 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన చరిత్ర ఉందని అందుకే 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా పోలవరం ప్రాజెక్టు స్పిల్ వేను, గేట్లను డిజైన్ చేశారని మేఘా ఇంజనీరింగ్ సంస్థ సీజీఎం చెప్పారు. ప్రస్తుతం పోలవరం స్పిల్ వే గేట్ల నుండి 15 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

# ఇక తిరుమలలో యూపీఐ చెల్లింపులు

తిరుమల, జూలై 14,తిరుమల కొండపై టీటీడీ విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. నగదు చెల్లింపుల స్థానంలో యూపీఐ చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకునే దిశగా అడుగులు వేసే టీటీడీ దేశవ్యాప్తంగా నగదు రహిత చెల్లింపులు జరుగుతున్న వేళ తిరుమలలోనూ యూపీఐ చెల్లింపులను అందుబాటులోకి తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద భక్తుల వసతి గదుల కేటాయింపును టీటీడీ ఎంచుకుంది.వసతి గదుల కేటాయింపు సమయంలో భక్తులు యూపీఐ విధానం ద్వారా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ వెల్లడించింది. త్వరలోనే టీటీడీకి సంబంధించిన అన్ని చెల్లింపులు యూపీఐ విధానంలోనే చేసేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపింది. భక్తులకు వసతి గదుల కేటాయింపు కౌంటర్లలోయూపీఐ చెల్లింపులకు లభించే ఆదరణను బట్టి? కొండపై

అన్ని రకాల సేవల చెల్లింపు విధానాలకు యూపీఐని అనుమతించే దిశగా టీటీడీ అడుగులు వేస్తోంది. కాగా తిరుమల కొండపై అన్ని విషయాలలో యూపీఐ విధానం పూర్తిగా అందుబాటులోకి వస్తే అవకతవకలకు అవకాశం ఉండదని టీటీడీ భావిస్తోంది.మరోవైపు టీటీడీ విద్యాసంస్థల ఆధునీకరణపై దృష్టి సారించినట్లు ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. ధర్మారెడ్డి చొరవతో మూడు టీటీడీ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను స్వీకరించేందుకు రేమండ్స్ అధినేత సింఘానియా అంగీకరించారు. ఆయా పాఠశాలల నిర్వహణపై టీటీడీ సంతృప్తి వ్యక్తం చేస్తే టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 35 విద్యాలయాల నిర్వహణ బాధ్యతలు చేపడతామని సింఘానియా వెల్లడించారు. మరోవైపు పద్మావతి మహిళా జూనియర్ కళాశాల నిర్వహణ బాధ్యతలు స్వీకరించేందుకు దాత కొట్టు మురళీకృష్ణ ముందుకు వచ్చారు. ఇప్పటికే పరకామణి మండప నిర్మాణం కోసం రూ.16 కోట్లను దాత మురళీకృష్ణ విరాళంగా అందించారు.

# స్త్రీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేసిన మహనీయురాలు దుర్గాబాయి దేశ్ ముఖ్



స్త్రీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేసిన మహనీయురాలు దుర్గాబాయి దేశ్ ముఖ్, వారు పేరుపొందిన స్వాతంత్ర్య సమరయోధురాలే కాకుండా ఒక సామాజిక కార్యకర్త కూడ. ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రిలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జూలై 15, 1909 న కృష్ణవేణమ్మ, రామారావు దంపతులకు దుర్గాబాయి జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే

## -నేడు అ ఫ్రీడమ్ ఫైటర్ జయంతి

హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసులవారికీ విద్యాబోధన అందించేవారు. బెనారస్ విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్యులేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్‌లో), 1942లో ఎల్. ఎల్.బి పూర్తిచేసింది.న్యాయశాస్త్రం చదివి మద్రాసులో హైకోర్టు వద్ద ప్రాక్టీసు ప్రారంభించింది దుర్గాభాయి దేశముఖ్ రాజకీయ నాయకురాలు కూడా ఆమె భారతదేశం యొక్క రాజ్యాంగ సభ మరియు భారతదేశం యొక్క ప్రణాళికా సంఘం సభ్యురాలు. దుర్గాబాయి చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకుంది. తెలుగుగడ్డ పై మహాత్మా గాంధీ రాకను పురస్కరించుకుని 12 ఏళ్ళ వయసులోనే ఈమె విరాళాలను సేకరించి ఆయనకు అందజేసింది. మహాత్ముని సూచన మేరకు ఏ మాత్రం ఆలోచించకుండా తన చేతులకు ఉన్న బంగారు గాజులను కూడా విరాళంగా అందజేసింది. ఈమె స్థాపించిన రెండు ఆసుపత్రులు, మూడు పాఠశాలలు, రెండు కాలేజీలు నేటికీ స్త్రీ అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. స్త్రీల అభ్యున్నతి కోసం ఈమె ఆధ్వర్యంలో 1937లో చెన్నైలో ఆంధ్ర మహిళా సభ స్థాపించబడింది. ఈమె 1941లో ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి, సంపాదకత్వ బాధ్యతలను నెరవేర్చింది. 1923లో కాకినాడలోని కాంగ్రెస్ సభలకు వాలంటీరుగా పనిచేస్తూ నెహ్రూ వద్ద టిక్కెట్ లేని కారణము చేత ఆయనను అనుమతించక, తన కర్తవ్య నిర్వహణకు గాను ఆయన నుండి ప్రశంసలను పొందింది. ఆ పై మహాత్ముని ఆంధ్ర పర్యటనలలో ఆయన హిందీ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించింది. ఉప్పు సత్యాగ్రహములో పాల్గొని అరెస్టు కాబడింది. భారత రాజ్యాంగ నిర్మాణ సభలో 1946 నుండి 1950 వరకు సభ్యురాలిగా పనిచేసిన పిమ్మట, 1952లో ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా పనిచేసారు. ఆ సందర్భములో సి.డి.దేశ్‌ముఖ్తో కలిగిన పరిచయం పరిణయానికి దారి తీసింది. వీరి వివాహము 1953 జనవరి 22న జరిగింది. ఈవిడ 1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలెకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు (సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డ్) వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేసారు. ఢిల్లీలో ఉన్న బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పనిచేసారు. వీరి స్వీయచరిత్ర భాషించిన శిలలు అన్న పేరుతో వెలువడింది

# ద్రౌపదికి అన్నీ ఓట్లు



విజయవాడ, జూలై 14, చిత్రం. నిజంగా ఇదొక విచిత్రం. ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీలో బీజేపీకి చోటు లేదు. ఒక్క ఎమ్మెల్యే అయినా లేరు, అసెంబ్లీలో ఆ పార్టీ బలం సున్నా. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ, ఏపీ నుంచి బీజేపీకి ప్రాతినిధ్యం లేదు, నిన్నమొన్నటి వరకు ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన రాజ్యసభ సభ్యులు ఇద్దరు ముగ్గురున్నా, ఇప్పుడు వారి పదవీ కాలం ముగిసిపోవడంతో, పార్లమెంట్ ఎగువ దిగువ సభల్లో, ఏ సభలోనూ ఏపీ బీజేపీకి ఎంట్రీ లేదు. రాష్ట్రంలో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీ ఏదీ లేదు. అధికార, ప్రతిపక్షాలలో (వైసీపీ, టీడీపీ)ఏదీ బీజేపీ మిత్ర పక్షం కాదు, మిత్ర పక్షం జనసేన పార్టీది కూడా బీజేపీ పరిస్థితే .. ఒక్క ఎంపీ లేరు. ఒక్క ఎమ్మెల్యే లేరు. రాష్ట్రపతి ఎన్నికల ఎలెక్టోరల్ కాలేజిలో బీజేపీ, జనసేన పార్టీలలో దేనికీ ఓటు లేదు. రాష్ట్రపతి ఎన్నికల ఎలెక్టోరల్ కాలేజిలోని ఓట్లలో ఒక్క ఓటు బీరు పోకుండా, బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమి ఖాతాలో చేరుతున్నాయి. అధికారికంగానా, అనదికారకంగానా అనేది పక్కన పెడితే అధికార వైసీపీ, ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపతి ముర్మకు అడగక ముందే మద్దతు తెలిపింది. ఇప్పుడు తాజాగా, ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ కూడా ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. సో ... రాష్ట్రం నుంచి పోలయ్యే ప్రతి ఓటు ముర్ము ఖాతాలో చేరుతుంది. భారత రాజకీయాల్లో ఇదొక విధంగా విచిత్ర పరిస్థితి.గతంలోనూ, ఒక రాష్ట్రంలో ఉన్నమొత్తం ఓట్లు ఒకే అభ్యర్థికి పోలైన సందర్భాలు ఉంటే ఉండవచ్చును, కానీ, రాష్ట్రంలో ఓటే లేని పార్టీ / కూటమి అభ్యర్థికి గంప గుత్తగా ఓట్లన్నీ పోలుకావడం, బహుశా రాష్ట్రపతి ఎన్నికల చరిత్రలో ఇదే మొదటి సారి కావచ్చును. అదొకటి అలాఉంటే, జూలై 18 జరిగే ప్రస్తుత రాష్ట్రపతి ఎన్నికలకు సమబందించి కొన్ని ఆసక్తి కర పరిణామాలు అయితే, చోటు చేస్కున్నాయి, రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి జూన్ 14 న, కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించింది. అయినా, ఎన్డీఅభ్యర్థి ఎవరైనా గెలుపు ముందుగానే ఖరారై పోవడం వలన, గెలుపు ఓటముల గురించి, పెద్దగా చర్చ జరగలేదు.అయితే, అధికార, విపక్షాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మొదలైన తర్వాత చిత్ర విచిత్ర పరిణామాలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి ఎంపిక ఒక ప్రహసంగా సాగింది. ఒకటో కృష్ణుడు, రెండవ కృష్ణుడు, మూడవ కృష్ణుడు ఇలా ఒక్కొక్క పేరు తెర మీదకు వచ్చి తప్పుకుంటూ పోయింది. చివరకు, యశ్వంత్ సిన్హా ఉమ్మడి అభ్యర్థిగా తెర మెడకు వచ్చారు. బీజేపీ/ ఎన్డీఏ గిరిజ మహిళ, ద్రౌపతి ముర్ముపేరును ప్రకటించిన తర్వాత, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు మద్దతు ఇస్తున్న పార్టీలు ఒకటికటిగా సారీ అంటూ చేయి వదిలేస్తున్నాయి. ముర్మకు మద్దతు ప్రకటిస్తున్నాయి. ముందుగా అనుకున్న విధంగానే ఏ కూటమిలోనూ లేని వైసీపీ, బీజేడీ (కారాణాలు ఏవైనా) ద్రౌపతి ముర్మకు మద్దతు ప్రకటించాయి. కానీ ప్రతిపక్ష కూటమిలోని పార్టీలో కూడా ఒకటొకటిగా జారిపోతున్నాయి,యశ్వంత్ సిన్హా స్వరాష్ట్రం ఝార్ఖండ్' లో అధికారంలో ఉన్న యూపీఏ భాగస్వామ్య పార్టీ జేఎంఎం ముర్మకు మద్దతు ప్రకటించింది. యశ్వంత్ సిన్హా స్వరాష్ట్రమే కాదు, సొంత పార్టీ, టీఎంసి కుడా, ఆయనను దూరంగానే ఉంచుతోంది. ఆయన పేరును వెనకుండి ముందుకు తెచ్చిన టీఎంసీ అధినాయకురాలు మమతా బెనర్జీ కూడా, యశ్వంత్ సిన్హాకు హ్యాండ్ ఇచ్చే సంకేతాలు ఇచ్చారు. ద్రౌపతి ముర్ము పేరు ముందే ప్రకటించి ఉంటే, అసలు యశ్వంత్ సిన్హాను బరిలో దించక పోదుమని, పరోక్షంగా, ముర్మకు మద్దతు ఇచ్చే సంకేతాలు ఇచ్చారు. అంతే కాకుండా గెలిచే అవకాశాలు ఎండీఏ అభ్యర్థికే ఉన్నాయని, యశ్వత్ సిన్హాను పోటీ నుంచి గౌరవప్రదంగా తప్పుకుంటే ఉత్తమం అనే సలహా ఇచ్చారా అన్నట్లుగా, మరో విధంగా సిన్హాను అవమానించే విధంగా ఓ ప్రకటన చేశారు. ప్రచారం పేరున బెంగాలుకు రావద్దని అన్నారు. చివరకు శివసేన రెండు వర్గాలు, బీజేపీ హార్డ్కోర్ శత్రు పక్షం ఎస్పీ, ఎస్పీ చీలిక వర్గం ఎస్బీఎస్పీ , బీఎస్పీ, గోవాలో కాంగ్రెస్ చీలిక వర్గం ఇలా ఒకటికటిగా పార్టీలు, ముర్మకు మద్దతు తెలుపుతున్నాయి. చివరకు కాంగ్రెస్ పార్టీలోనూ యశ్వంత్ సిన్హా కు సంపూర్ణ మద్దతు లభించే పరిస్థతి లేదని అంటున్నారు. తెలంగాణలో పర్యటనలో యశ్వంత్ సిన్హా తెరాస, కాంగ్రెస్ రాజకీయ వైరుధ్యాల కారణంగా కాంగ్రెస్ పార్టీని కలవకుండానే వెనక్కు వెళ్ళిపోయారు. ఇలా ఓ వంక ప్రతిపక్ష కూటమిలోని పార్టీలు క్యూకట్టి ఎన్డీఏ అభ్యర్థు ద్రౌపతి ముర్మకు జై కొడుతున్నాయి. మరోవంక మద్దతు ఇస్తున్నపార్టీలు ఏవీ కూడా ఆయన్ని సొంతం చేసుకుంటున్నట్లు లేదు. తెరాస వంటి కొన్ని పార్టీలు ఇంకా యశ్వంత్ సిన్హా'కు మద్దతు తెలుపుతున్నా,చివరకు ఆత్మ ప్రభోధమే అందరి నినాదం అయ్యేలా వుందని అంటున్నారు. నిజానికి యశ్వత్ సిన్హాకు గెలుపు మీద ఎప్పుడూ ఆశలు లేవు.. కానీ, ఓటమి ఏ స్థాయిలో ఉంటుంది అనేదే, ఇప్పుడు అందరి ముందున్న ప్రశ్న.

## రెడీ అవుతున్న టీడీపీ లిస్టులు...

తిరుపతి, జూలై 14, లుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈసారి ఎన్నికలను అంత సులువుగా తీసుకోవడం లేదు. జగన్ ను పైకి తేలిగ్గా తీసుకుంటున్నట్లు కన్పిస్తున్నా లోలోపల అన్ని రకాలుగా మధనపడుతున్నారు. జగన్ కు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అండదండలున్నాయి. తనకు 2019 ఎన్నికల మాదిరిగానే అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదురు కావచ్చు. బీజేపీతో సయోధ్య కోసం తాను చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయన్న నమ్మకం చంద్రబాబుకు కూడా లేదు. అందుకే ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బీజేపీ గుడ్ లుక్స్ లో బీజేపీ గుడ్ లుక్స్ లో ఉండటానికి చంద్రబాబు చేయని ప్రయత్నాలు లేవు. అందుకే అడగకపోయినా ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్మకు మద్దతు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తనతో పొత్తు లేకపోయినా సరే.. ఆటంకాలు కల్పించకుండా ఉండేలా చూసుకునేందుకు చంద్రబాబు ముర్మకు మద్దతు ప్రకటించారన్నది పొలిటికల్ కారిడార్ లో విన్పిస్తున్న టాక్. అయితే బీజేపీని పూర్తి స్థాయిలో నమ్మేందుకు కూడా చంద్రబాబు సిద్ధంగా లేరు. చివరి నిమిషంలో తన మిత్రుడిగా జగన్ భావించి సహాయసహకారాలు అందిస్తే తట్టుకోవడానికి ముందస్తు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు., జగిత్యాలలో జరిగింది కాదు ఆర్థిక వనరులు.... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కేవలం ఆర్థిక వనరులను దెబ్బతీసే ప్రయత్నమే చేస్తుంది. తమ పార్టీ మద్దతుదారులపై ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో దాడులు చేస్తుంది. ఆర్థికంగా ఎన్నికలకు ముందు పార్టీని దిగ్భంధనం చేయగలుగుతుంది. అంతే తప్ప ప్రజల మనసులను మార్చలేదు. ప్రజలు తమ వైపు మొగ్గు చూపుతున్నారని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. అందుకే బీజేపీతో కయ్యానికి దిగకుండా మంచిగానే ఉంటూ ఎన్నికలకు వెళ్లాలన్నది ఆయన యోచన. 70 నియోజకవర్గాల్లో... అందుకే ఎన్నికలకు ముందుగానే అభ్యర్థులను ప్రకటించేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఆరు నెలలకు ముందుగానే 70 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాలని, పోరుకు సిద్ధం చేయాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత చంద్రబాబు అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. కానీ ఈసారి మాత్రం ఎంపిక చేసుకున్న 70 నియోజకవర్గాల్లో ఆరు నెలలకు ముందు అభ్యర్థులను ప్రకటిస్తారు. వారికి ఏడాది ముందే సంకేతాలు ఇస్తారు. ఇలా కొంత పార్టీని ఆయా నియోజకవర్గాల్లో బలోపేతం చేసుకోవడంతో పాటు వారు ఆర్థిక వనరులు సమీకరించుకునేందుకు కూడా వీలు చిక్కుతుంది. అందుకే ఈసారి ఫస్ట్ లిస్ట్ ఆరు నెలల ముందే టీడీపీ అధినేత విడుదల చేయనున్నారని పార్టీ ఇన్నర్ వర్గాల టాక్.

## విద్యార్థుల ప్రయోజనం కోసమే ప్రయోగశాల

### వీసీ ఆచార్య సూర్యకళావతి

కడప తెలుగు లాంగ్వేజ్ విద్యార్థులు ఆధునిక సాంకేతికను పొంది ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకునే లా తెలుగు భాషా ప్రయోగశాల ఉపయోగపడు తుందని యోగి వేమన విశ్వవిద్యాల యం ఉపకులపతి ఆచార్య మునగల సూర్య కళావతి అన్నారు.యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఏర్పాటు చేసిన తెలుగు భాషా ప్రయోగశాలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మునగల సూర్య కళావతి ప్రారంభించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలుగు భాషా ప్రయోగశాలలో డిజిటల్ లాంగ్వేజ్ ని నేర్పించడం జరుగుతుందన్నారు. అలానే పత్రికల్లో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యతను, విద్యార్థు లు స్వయంగా అవసరమైన మెటీరియల్ రూపకల్పన చేసుకునేలా తయారు చేస్తారన్నారు. సాఫ్ట్వేర్ కంపెనీలలో డేటా సైంటిస్ట్ గా లాంగ్వేజ్ లలో కూడా అవకాశాలు ఉన్నాయని వాటిని అందుకునేలా విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తారన్నారు. విద్యార్థులు ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా ల్యాబ్ ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఆఫ్లైన్ , ఆన్లైన్ లో ఒకేసారి పాఠాలు బోధించడానికి అనువుగా ప్రయోగశాలను తయారు చేశామన్నారు.కుల సచివులు ఆచార్య డి.. విజయరాఘవ ప్రసాద్మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా వై వి లో వై వి యు తెలుగుశాఖలో లాంగ్వేజ్ ల్యాబ్ ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు చదువులతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి సూచించారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణా రెడ్డి మాట్లాడుతూ సైన్స్ ల్యాబ్ లతోపాటు గా లాంగ్వేజ్ ల్యాబ్ లు ఏర్పాటు కావడం మంచి పరిణామం అన్నారు. విద్యార్థులు ఆధునిక ప్రపంచానికి అవసరమైన వనరుగా ఎదిగేలా శిక్షణ ను ఇస్తామన్నారు. ఆర్ట్స్ విభాగ డీన్ ఆచార్య తప్పెట రామ ప్రసాద్ రెడ్డి హాజరై మాట్లాడుతూ తెలుగు శాఖ విద్యార్థులు ప్రయోగశాలను చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. వైవీయూ తెలుగు శాఖాధిపతి డా. ఎన్. ఈశ్వర రెడ్డి ఎం. ఏ తెలుగు విద్యార్థులు, పిహెచ్. డి చేస్తున్న పరిశోధకులకు అవసరమైన నైపుణ్యాలను అందించడానికి యోగి వేమన విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టిందన్నారు. ల్యాబ్ ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు డాక్టర్ వై పి వెంకటసుబ్బయ్య, తెలుగు శాఖ సహ ఆచార్యులు డా.పి.రమాదేవి,ఆచార్యులు, సహ ఆచార్యులు, సంయుక్త ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## బోగస్ బాబు బోగస్ సర్వేలు...

### మండి పడ్డ రోజా

తిరుపతి జూలై 14 పది రోజులకి ముందు సీఎం అయినా మహారాష్ట్ర సీఎంకు టాప్ 5 ర్యాంకు, మూడు సంవత్సరాలుగా అన్ని పథకాలను అమలు చేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్కి అట్టడుగు ర్యాంకు ఇవ్వడంపై రోజా మండిపడ్డారు. తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపీ దర్శన సమయంలో మంత్రి రోజా, నటి రవళి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం ఆలయం అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందచేసారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి రోజా చంద్రబాబుపై ఘాటుగా విమర్శలు చేశారు.బోగస్ సర్వేలు చేయించే చంద్రబాబుని అందరు బోగస్ బాబుగా పిలుస్తున్నారని అన్నారు. చంద్రబాబు, నారా లోకేష్కి చిన్న మెదడు చిట్లిపోయిందని, త్వరలోనే మానసిక వైకల్య కేంద్రంలో చంద్రబాబు చేర్పించాలని మంత్రి రోజా నిప్పులు చెరిగారు.



## విలీన ఆందోళనలు ఉధృతం

నెల్లూరు, జూలై 14, పాఠశాలల విలీన ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. గత మూడు రోజులుగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలలకు తాళాలు వేశారు. తమ పిల్లలను మూడు కిలోమీటర్ల దూరం ఉన్న పాఠశాలకు పంపడం కష్టమని, రహదారులు దాటే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విలీనాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఎంఇఒకు వినతిపత్రాలు అందజేశారు. విద్యార్థుల, తల్లిదండ్రుల ఆందోళనకు సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు.నెల్లూరు జిల్లాలోని టిపిగూడూరులో పాఠశాలకు తాళం వేసి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విలీన నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని, లేకపోతే ఆందోళనను ఉదఅతం చేస్తామని హెచ్చరించారు.ప్రకాశం జిల్లా పొదిలి మండలంలోని మాదాలవారిపాలెం ఎస్సికాలనీలోని హరిజన పాఠశాలలోని తరగతులను వేరే పాఠశాలలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి.. నిరసన తెలిపారు.కడప జిల్లా కమలాపురం మండల పరిధిలోని విభరాపురం గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను పాఠశాల గదిలో నిర్బంధించారు.అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం అన్నవరం పాఠశాలలో 6, 7, 8 తరగతులను వేములపూడి జెడ్పి పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ ఎంఇఒ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ అయ్యప్పరెడ్డి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. కశింకోట మండలం బయ్యవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను స్థానిక హైస్కూల్లో విలీనం చేయొద్దంటూ ఆందోళన చేపట్టి ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి మండలం బౌలువాడ పంచాయతీ ఆర్విఎస్.నగర్ రిక్షా కాలనీ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను బౌలువాడ ఎంపియుపి స్కూల్లో విలీనం చేస్తే సహించేది లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనకాపల్లి – చోడవరం రోడ్డులో బైఠాయించారు. నిరసనకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మద్దతు తెలిపారు. నర్సీపట్నం మండలంలోని తురకబడి పాఠశాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాలల విలీనాన్ని నిరసిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ వద్ద నిరసన తెలిపారుఅనంతపురం జిల్లా కుందుర్పి మండలం మాయదార్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలలో విలీనం చేయొద్దంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం మైలసముద్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. కర్నూలు జిల్లా కోడుమూరులో ఎంఇఒ, పంచాయతీ కార్యాలయాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేసి ఎంఇఒకు వినతిపత్రాలు అందజేశారుపశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని ఏడో వార్డులోని ప్రాథమిక పాఠశాలలోని తరగతులను ఎస్కెపిఅండ్టివిఆర్ మున్సిపల్ హైస్కూల్లో విలీనం చేయడం తగదని విద్యార్థులు ధర్నా చేశారు. తమ పిల్లలు రోడ్డు దాటి వెళ్లి రావాలంటే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మద్దతు తెలిపారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.శ్రీకాకుళం జిల్లా పలాస మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, బ్రాహ్మణతర్లా ప్రాథమికోన్నత పాఠశాలల వద్ద విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. రూ.లక్షల వ్యయంతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది నేడు వేరే పాఠశాలలో విలీనం చేయడం దారుణమన్నారు. కవిటి మండలం బెజ్జిపుట్టుగ ప్రాథమిక పాఠశాలను మూడు కిలోమీటర్ల దూరంలోని జగతి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేయొద్దని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆధ్వర్యాన గ్రామస్తులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్కు వినతిపత్రం అందజేశారు.విజయనగరం పరిధిలోని జమ్ము ప్రాథమిక పాఠశాల, వేపాడ మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. రేగిడి మండలంలోని మునకలవలస ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

## ఆగస్టు నెల 9 నుంచి ఆర్మీ సర్వీస్ శిక్షణ తరగతులు

### -కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ చక్రధర్ బాబు

నెల్లూరు ఆర్మీ సర్వీస్ లో చేరే యువకుల కోసం వచ్చే ఆగస్టు నెల 9వ తేదీ నుండి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేయాలని జిల్లా కలెక్టర్ కె వి ఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ వారి క్యాంప్ కార్యాలయంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ ఆర్మీలో చేరే సువర్ణ అవకాశం అంటూ డి ఆర్ డి ఏ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రాలను, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్మీ సర్వీసులో చేరే యువకుల కోసం నెల్లూరు నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఆధ్వర్యంలో వచ్చే సెప్టెంబర్ మాసం 15వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహించ బడుతుందన్నారు. ఇందుకోసం అర్హులైన యువకులు వచ్చే ఆగస్టు మూడో తేదీలోగా వారి పేర్లను డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యు డాట్ జాయిన్ ఇన్ ఇండియన్ ఆర్మీ డాట్ ఎన్ ఐ సి డాట్ ఇన్ అనే వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ విషయమై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ముఖ్యంగా గ్రామ వార్డు సచివాలయాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా నుంచి వీలైనంత ఎక్కువమంది యువకులు ఆర్మీకి ఎంపిక అయ్యేందుకు వీలుగా వారికి వచ్చే నెల 9వ తేదీ నుండి తగినంత శిక్షణ ఇచ్చి సుశిక్షితులుగా తీర్చిదిద్దాలన్నారు. ఎస్సీ ఎస్టీలు తదితర దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాల వారు ఎంపిక అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రీడా సంస్కృతి పెంపొందించేందు కోసం జగనన్న స్పోర్ట్స్ క్లబ్బులు ఏర్పాటు చేయాలని ఇందుకోసం గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడల వలన దేహదారుఢ్యంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని తెలియజేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసేందుకు కనీసం నెలకు ఒకసారి టోర్నమెంట్లు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించి 14 రకాల క్రీడల్లో జిల్లా స్థాయి బృందాలను సిద్ధం చేయాలని వారిని రాష్ట్రస్థాయి సీఎం టోర్నమెంట్లకు పంపించవలసి ఉంటుందన్నారు. అలాగే నెలకోసారి శాప్ లీగ్ టోర్నమెంట్లు జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు నగరంలోని ఏ సి ఎస్ ఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ప్రాంతీయ స్పోర్ట్స్ అకాడమీ భవనం నిర్మాణం కోసం, మొగళ్లపాలెంలోని అంతర్జాతీయ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నిధుల సమీకరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో సెట్నెల్ సీఈవో డి. పుల్లయ్య, ఏఆర్ఏఎస్పి శ్రీనివాసరావు, డిఆర్డిఏ పిడి సాంబశివరెడ్డి, డిపిఓ ధనలక్ష్మి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ పెంచలయ్య, చీఫ్ కోచ్ యతిరాజు ,డీఎస్ ఏ పర్యవేక్షకులు విజయ్ కుమార్, కమిటీ సభ్యులు సెపక్ తక్రా అంతర్జాతీయ క్రీడాకారిణి ఉమా, బీచ్ కబడ్డీ క్రీడాకారుడు సురేష్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ కుమార్, డీకే డబ్ల్యూ కళాశాల వ్యాయామ విద్య ఉపన్యాసకులు విజయ కళ పాల్గొన్నారు.

## నల్లమల అడవి ప్రాంతంలో లారీ బోల్తా

నంద్యాల నంద్యాల – గిద్దలూరు ఘాట్ రోడ్డులోని పచ్చర్ల సమీపంలో చేపల లోడుతో నంద్యాల వైపు వెళ్తున్న కర్ణాటక చెందిన కంటైనర్ లారీ బోల్తా పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్రైవర్ కి గాయాలయ్యాయి. రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గిద్దలూరు, మార్కాపురం, ఒంగోలు, విజయవాడ, గుంటూరు, వైపు వెళ్లే వాహనాలు వందల సంఖ్యలో తెల్లవారుజామున నుండి నిలిచిపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు విషయం తెలుసుకున్న మహానంది రోడ్ సేఫ్టీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రెండు క్రేన్ల సహాయంతో కంటైనర్ లారీని పక్కకు తొలగించారు.దింతో యదావిధిగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు.

## బీజేపీ శ్రేణుల అందోళన

విశాఖపట్నం రాష్ట్రంలో పేదలకు బియ్యం పంపిణీ నిలిపివేతపై విశాఖలో బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ మాధవ్ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్ కు వినతి పత్రాని బిజెపి నాయకులు అందించారు.ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పంపిణీకి రాష్ట్ర ప్రభు త్వం అడ్డంకులు సృష్టిస్తోందని చెప్పారు.ఈ విషయాన్ని రానున్న పార్లమెంట్ సమావేశాలలో చర్చిస్తామన్నా రు.

## మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

గూడూరు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నాము అని మున్సిపల్ కార్మికురాలు సుభాషిని అన్నారు . గూడూరు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులు చేస్తున్న సమ్మె లో భాగంగా గురువారం గూడూరు పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు .గూడూరు పట్టణంలోని మున్సిపల్ శాఖ కార్యాలయం నుండి సమ్మెలో పాల్గొన్న కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన తో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ సెంటర్ వద్ద తమ కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు . ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికురాలు సుభాషిని మాట్లాడుతూ వైసిపి పార్టీ తప్ప మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించారని తెలిపారు . ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులు తమ సమ్మెకు మద్దతు ప్రకటిస్తే మున్సిపల్ శాఖ అధికారులు వారిపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు . ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు గోపి , మన్నెమ్మ, మహేంద్ర, మురళి, గణేష్, రాఘవులు, ప్రసాద్, వెంకటకృష్ణ వామపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## రుషికొండ నిర్మాణాలపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన చంద్రబాబుకు బుద్ధి రాలేదు

### మండిపడ్డ మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాఖపట్నం జూలై 14 విశాఖపట్నంపై చంద్రబాబు, ఎల్లో మీడియా విషం చిమ్ముతోందని మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్ని అనుమతులతో రుషికొండ రిసార్ట్స్ను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. ఎక్కడ నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. పర్యాటకులకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించడానికి 7 స్టార్ హోటల్ తరహాలో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రుషికొండపై విశాఖకు చెందని వారితో చంద్రబాబు తప్పుడు కేసులు వేయిస్తున్నారని మంత్రి మండిపడ్డారు."రుషికొండ నిర్మాణాలపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన చంద్రబాబు నాయుడుకి బుద్ధి రాలేదు. ఇప్పటికీ విశాఖకు పరిపాలన రాజధాని రాకుండా చంద్రబాబు నాయుడు కుట్రలు చేస్తున్నారు. అమరావతి కోసం విశాఖను చంద్రబాబు నాశనం చేస్తున్నారు. విశాఖ అభివృద్ధి చెందితే అమరావతిలో బినామీ భూములకు రేట్లు పడిపోతాయని చంద్రబాబు భయపడుతున్నారని మంత్రి అమర్నాథ్ దుయ్యబట్టారు.



# ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలి..



**కనీస వేతనం రూ.15 వేలకు పెంచాలి..**
**అధికారులు, సిబ్బంది వేధింపులు ఆపాలి..**
**కలెక్టరేట్ కు తరలి వచ్చిన ఆశాలు..**
**కలెక్టరేట్ ముందు ఆశాల ధర్నా**

నంద్యాల.. జూలై 14, తమ సమస్యలు పరిష్కరించాలని, ఆశాల పై పని భారం తగ్గించాలని ధరలకు అనుగుణంగా రూ.10 వేల నుండి రూ.15 వేలకు జీతాలు పెంచాలని సిఐటియూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు వైఎస్ఆర్ సెంటినరీ హాల్ నుండి ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సి ఐ టి యూ) ఆధ్వర్యంలో ఆశాలు కలెక్టర్ కార్యాలయం వైపు ర్యాలీ గా బయలుదేరారు. అక్కడే ఉన్న పోలీసులు కలెక్టరేట్ సమీప దూరంలో ర్యాలీని అడ్డగించి ఆపడంతో ఆశా వర్కర్లు అక్కడే ఊర్చొని నిరసన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని, ఆశాల ఐక్యత వర్ధిల్లాలి. ఆశాలపై ప్రభుత్వం చిన్న చూపు తగదంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సి ఐ టీ యూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, సి ఐ టి యూ జిల్లా నాయకులు బాల వెంకట్,ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణ కుమారి లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్ర లో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తానని, అనేక హామీలు ఇచ్చారన్నారు. ఎన్నికల అనంతరం ఆశా వర్కర్ల పై పని భారం పెంచారన్నారు. ప్రజలకు అనారోగ్యం వచ్చిన జ్వరం వచ్చిన వారి సేవలో ఆశాలే ముందుంటారన్నారు. కానీ ఆశాలకు ఆరోగ్యం బాగులేక పోయిన విధుల్లో ఉండాలని సెలవులు మాత్రం ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలంటే ప్రతి ఒక్కరికీ సులకన భావం ఉందని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పనిని ఆశాలతోనే చేయిస్తున్నారని తమ బాధ ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు.జీతం తక్కువ పని మాత్రం ఎక్కువ ఉందని తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని వాపోయారు. జ్వరం వస్తే సెలవులు లేదు. ఫంక్షన్లకు, పెండ్లిండ్లకు పెళ్ళాలంటే సెలవులు ఉండవు.. అన్ని వదులుకొని 24 గంటలు ఆన్ డ్యూటీ లో ఉంటున్నామని పేర్కొన్నారు.ఆశాల పట్ల అధికారులకు ప్రేమ, దయాగుణం లేదన్నారు. ఉద్యోగులనే పేరుతో ఆశాలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయడం లేదన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారన్నారు.కానీ వేతనం మాత్రం రూ.10 వేలు ఇస్తున్నారని ఏ మాత్రం కుటుంబాల పోషణకు సరిపోవడం లేదన్నారు.ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇచ్చే గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఆశాల పట్ల అధికారులకు ప్రేమ, దయాగుణం లేదన్నారు.కరోనా సమయం లో ముందుండి పనిచేసిన ఆశాలకు కనీసం గుర్తింపులేకపోవడం బాధాకరమన్నారు. కొరోనా తో మృతి చెందిన ఆశా వర్కర్ల కుటుంబాలను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ఆశా వర్కర్ల కు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద 5 లక్షలు ఇవ్వాలని, ఆశాలకు 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సి.హెచ్.డబ్ల్యూ ఓ లను ఆశాలుగా మార్చాలన్నారు. సోమాలమ్మ మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, మెటర్నటీ లీవ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.62 సం॥ రిటైర్మెంట్ జీఓ వర్తింపచెయ్యాలని కోవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు రూ. 10 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని,10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని 1000-1200 ల జనాభా కు ఒక ఆశా వర్కర్ను నియమించాలని,నాణ్యమైన సెల్ ఫోన్ , 4 జి సిమ్ ఇవ్వాలని,ఏఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు వెయిటేజీని ఇవ్వాలని గౌరవ వేతనం ఒకేసారి ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవిన్యూ అధికారి పుల్లయ్య కు అందజేశారు. ధర్నా కార్యక్రమం లో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్లు నాగమణి, వరాలమ్మ, రమణమ్మ, శిరోమణి, జయలక్ష్మి, సువార్తమ్మ, భారతి, మాదవి, పెద్దక్క, చెన్నమ్మ, సుమలత, మంజుల, సువర్ణ,జిల్లాలోని పి హెచ్ సి, సిహేచ్ సి అర్బన్ హెల్త్ సెంటర్ ల పరిధిలో పనిచేసే ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను తక్షణమే ఆపాలి



**-: ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్**

కర్నూలు జూలై 14, , రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 84,85,117 వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్ డిమాండ్ చేశారురాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 117ను అడ్డుపెట్టుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలను 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్ యుఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందని, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్ గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాలు సరైన ప్రణాళిక లేకుండా తీసుకొని వచ్చిన జాతీయ విద్యా విధానం రావడం వలన విద్యార్థులు డ్రాపోడ్ అయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని మన రాష్ట్రంలో అక్షరాస్యత నిష్పత్తి పెరుగుతుందని వారన్నారు . ఈ జీవో నెంబర్ 117 ప్రకారం మన రాష్ట్రంలో దాదాపుగా 8400 స్కూల్స్ మూతపడుతాయని గ్రామీణ స్థాయిలో మూడో తరగతి విద్యార్థి ఏ విధంగా రెండు కిలోమీటర్లు దూరాన్ని రోడ్లు, వంకలు, వాగులు దాడుకుంటు ఏ విధంగా పోతారని వారు మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ శాతం పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని వారిపై అదనంగా చార్జీల మోత కూడా వాళ్ళపై పడుతుందని అన్నారు. తరగతుల విలీనం వలన విద్యార్థులు చదువుకు దూరమవుతారని, కావున ఈ జీవో నెంబర్ను వెనక్కి తీసుకొని యధావిదంగానే ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులను వారి యొక్క తల్లిదండ్రులను కలుపుకొని తాడేపల్లి లో ఉన్న సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. 117 జీవో సవరణలు కాకుండా , పూర్తిగా రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రి గారికి మరియు ముఖ్యమంత్రి గారికి లేఖ రాస్తున్నట్లు నాగమధు యాదవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరయ్య, జిల్లా నాయకులు వెంకటేష్, అర్షద్, రవి ,భాస్కర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పేరుకుపోయిన చెత్త

విజయవాడ, జూలై 14, ఏపీలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. మున్సిపల్ కార్మికుల సమ్మెతో నగరాలు, పట్టణాలు కంపుకొడుతున్నాయ్. సేమ్ టైమ్, ఆందోళనలతో దద్దరిల్లిపోతున్నాయ్ మున్సిపాలిటీలు. మున్సిపల్ కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయ్. స్టేట్‌వైడ్‌గా సుమారు 35వేల మంది కార్మికులు విధులు బహిష్కరించడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. అసలే, వర్షాకాలం, మరోవైపు జోరువానలతో అంతంతమాత్రంగా ఉండే పారిశుద్ధ్యం, సమ్మె కారణంగా మరింత అధ్వాన్నంగా తయారైంది. పీఆర్సీ అమలు, వేతనాల పెంపు, ఆదివారం సెలవు లాంటి 9 డిమాండ్లతో సమ్మెకు దిగారు మున్సిపల్ కార్మికులు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో సుమారు 35వేల మంది కార్మికులు రోడ్లపైకొచ్చి నిరసనలు తెలుపుతున్నారు.మున్సిపల్ కార్మికులంతా ఏకతాటిపైకి రావడంతో సమ్మె ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి కంపుకొడుతున్నాయ్ మున్సిపాలిటీలు. గుంటూరు, విశాఖలో ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయ్. గుంటూరు కార్పొరేషన్‌లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతుండటంతో నగరమంతా దుర్గంధం వస్తోంది. ఒక్క గుంటూరులోనే రెండు వేల మంది కార్మికులు విధులు బహిష్కరించడంతో పారిశుధ్య నిర్వహణ దారుణంగా తయారైంది. స్ట్రీట్ లైట్స్ నిర్వహణ కూడా నిలిచిపోవడంతో రాత్రిపూట చీకటిమయంగా మారింది గుంటూరు నగరం.ఇక, ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు కార్మికులు. ఎన్నికల హామీ మేరకు మున్సిపల్ వర్కర్లను పర్మినెంట్ చేయాలంటూ నినాదాలు చేశారు. విశాఖలో మున్సిపల్ కార్మికుల ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు, అరెస్టులకు దిగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. చివరికి కార్మికులను బలవంతంగా అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు పోలీసులు.

# కరెంటు ట్రాన్స్ ఫార్మార్ ఎర్పాటుచేయాలని ట్రాన్స్ కో డిఇ కి వినతి



కర్నూలు జూలై 14, ఐద్వా వీకర్ సెక్షన్ కాలనీ లో ఖళీ2 ట్రాన్స్ ఫార్మార్ ఎర్పాటుచేయాలని ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు సమస్యను పరిష్కరించాలని ప్రజల సంతకాలతో కూడిన వినతి పత్రన్ని ట్రాన్స్ కో డి.ఇ గారికి ఐద్వా జిల్లా నాయకురాలు యన్,శ్యామలమ్మ అఖఓ పార్టీ నగరకార్యదర్శి టీ.రాముడు.ఐద్వానాయకురాళ్ళు అనసూయ,సుబ్బమ్మ,గోహర్ ఫాషా బృందం ఇవ్వడం జరిగింది ఇసందర్బంగా వారు మాట్లాడుతు కర్నూలు కార్పోరేషన్ పరిధి లో ఉన్న వీకర్ సెక్షన్ కాలనీ గాలెమ్మా గుడి ఎదురుగా ఉన్న ట్రాన్స్ ఫారాం పరిదిలో ఉన్నకుటుంబాల ప్రజలు కుళాయికు నీళ్లు వదిలినప్పుడు సూర్యనారాయణ నగర్, డిష్ ఎరియా, ఈ రెండు ప్రాంతాల లో కరెంట్ పోతుంది మా కాలనీ లో రెండురోజులకు ఒక్కసారి నీళ్లు వస్తాయి నీళ్లు ఎటైం లో వస్తాయి అని అందరూ ఇంటిదగ్గర ఉండే పరిస్థితి ఉంది, చాలా సార్లు రాత్రి పూట వదులుతారు ఆ టైం లో కరెంట్ పోవడంతో కాలనీ వాసులు రాత్రి వేళల లో చాలా ఇబ్బంది పడుతున్నారు కాబట్టి ట్రాన్స్ కో అదికారులు తక్షణమే మరోక ట్రాన్స్ ఫార్మార్ ని ఎర్పాటు చేసి కరెంటు సమస్యను పరిస్కారం చెయ్యాలని కోరుచున్నాము

# యాక్షన్ మేకింగ్ ఆఫ్ రామారావు ఆన్ డ్యూటీ




మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'రామారావు ఆన్ డ్యూటీ'. పొలిటికల్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ మూవీ ద్వారా శరత్ మండవ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'జైభీమ్' ఫేమ్ రజీషా విజయన్ 'మజిలీ' ఫేమ్ దివ్యాన్షకౌశిక్ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. భారీ అంచనా మధ్య రూపొందుతున్న ఈ మూవీని ఎస్.ఎల్ వీ సినిమాస్ బ్యానర్ ఆర్ టీ టీమ్ వర్క్స్ బ్యానర్ లపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.రవితేజ కెరీర్ లో మరో మాసీవ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాని జూలై 29న భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూవీ ప్రమోషన్స్ ని మేకర్స్ ప్రారంభించారు. మాస్ మహారాజా రవితేజ డిప్యూటీ కలెక్టర్ గా రామారావు అనే పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ మూవీ టీజర్ సినిమాపై అంచనాల్నిపెంచేసింది. విక్రమార్కుడు క్రాక్ వంటి హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ల తరహాలో రూపొందుతున్న ఈ మూవీ మళ్లీ రవితేజకు ఆ స్థాయి సక్సెస్ ని అందిస్తుందని చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా మేకింగ్ పరంగానూ హీరో రవితేజ కారణంగానూ ఈ మూవీ రిలీజ్ వాయిదా పడుతూ వస్తోందంటూ రక రకాల ఊహాగానాలు వినిపించాయి. అయితే వాటన్నింటికీ చెక్ పెడుతూ మేకర్స్ ఈ మూవీని ఎట్టకేలకు జూలై 29న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నామని ప్రకటించారు. అప్పటి నుంచి ప్రమోషన్స్ ని స్పీడప్ చేస్తూ సినిమాపై అంచనాల్ని పెంచేస్తున్నారు. దాదాపు తొమ్మిదేళ్ల విరామం తరువాత హీరో వేణు ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్ గా నటిస్తూ రీ ఎంట్రీ ఇస్తున్నారు.ఇదిలా వుంటే ఈ మూవీ రిలీజ్ కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో మీడియా ప్రమోషన్స్ ని స్టార్ట్ చేసిన మేకర్స్ బుధవారం 'యాక్షన్ మేకింగ్ ఆఫ్ రామారావు ఆన్ డ్యూటీ' పేరుతో ఈ మూవీ మేకింగ్ వీడియోని విడుదల చేసింది. పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్ టైనర్ కావడంతో ప్రధానంగా యాక్షన్ ఘట్టాలకు సంబంధించిన మేకింగ్ వీడియోని విడుదల చేశారు. ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ నేపథ్యంలో చిత్రీకరించిన సన్నివేశాలు రవితేజ దర్శకుడు శరత్ మండవ చిత్ర బృందం ఈ మూవీ కోసం పడిన శ్రమ కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తోంది.మేకింగ్ వీడియో చూస్తుంటే 'రామారావు ఆన్ డ్యూటీ'తో రవితేజ అభిమానులకు మాస్ ట్రీట్ ఇవ్వబోతున్నట్టుగా స్పష్టమవుతోంది. ఇదిలా వుంటూ ఈ మూవీ థియేట్రికల్ ట్రైలర్ ని జూలై 16న రిలీజ్ చేయబోతున్నారు. దీంతో మాస్ మహారాజా హంగామా మరింతగా మొదలు కానున్నట్టుగా తెలుస్తోంది.ఇప్పటికే హైప్ క్రియేట్ అయిన ఈ మూవీలోని ఇతర పాత్రల్లో తనికెళ్ల భరణి నాజర్ నరేష్ జాన్ విజయ్ పవిత్ర లోకేష్ చైతన్యకృష్ణ రాహుల్ రామకృష్ణ శ్రీ మధుసూధన్ రావు సురేఖా వాణి తదితరులు నటించారు. అన్వేషీ జైన్ ప్రత్యేక గీతంలో నటించిన విషయం తెలిసిందే.

# 'థాంక్యూ' డైలాగ్ ను చై-సామ్ విడాకులతో లింక్ చేస్తున్నారే..!



అక్కినేని నాగ చైతన్య నటించిన "థాంక్యూ" మూవీ రిలీజ్ కు రెడీ అయింది. దిల్ రాజు నిర్మాణంలో విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 22న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం మేకర్స్ ట్రైలర్ ను ఆవిష్కరించారు.అభి అనే వ్యక్తి జీవితంలోని వివిధ దశలను 'థాంక్యూ' సినిమాలో చూపించబోతున్నట్లు ట్రైలర్ ని బట్టి అర్థమైంది. ప్రేమ బాధ కోపం సంతోషం.. ఇలా అన్ని రకాల ఎమోషన్స్ తో కూడిన ఈ ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంది. అయితే ఇందులోని ఒక డైలాగ్ ప్రత్యేకంగా నిలిచింది.నాగచైతన్య వాయిస్ ఓవర్ లో 'ఒక మనిషిని పట్టుకొని వేలాడే ప్రేమ కంటే.. స్వేచ్ఛగా వదిలేసే ప్రేమ గొప్పది' అనే డైలాగ్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. అంతేకాదు ఇది చైతూ నిజ జీవిత సంఘటనలను ప్రతిబింబించేలా ఉందని పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.పరోక్షంగా సమంత ను టార్గెట్ చేసేలా ఉందని.. ఇదే కారణంతో తమ అభిమాన హీరో ఆమెను వదులుకున్నారని కొందరు అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. ఇక్కడ సమంతను కూడా ట్రైలర్ ను చూడమని ట్యాగ్ చేస్తున్నారు.ఇంతకముందు 'థాంక్యూ' టీజర్ లో 'లైఫ్ లో ఇంక కాంప్రమైజ్ అయ్యేదే లేదు.. ఎన్నో వదులుకొని ఇక్కడికి వచ్చాను' 'నన్ను నేను సరి చేసుకోడానికి.. నేను చేస్తున్న ప్రయాణమే ఇది' వంటి డైలాగ్స్ కూడా సామ్ ను ఉద్దేశిస్తూ చెప్పినవే అని అన్నారు.'నువ్వు ఆల్రెడీ సరి అయిపోయావు బ్రదర్' అంటూ రానా దగ్గుబాటి కామెంట్ చేయడం నెటిజన్లకు మరింత ఉత్సాహమిచ్చింది. ఇప్పుడు ట్రైలర్ లోని డైలాగ్ చైతూ మరోసారి తమ మాజీ భార్యతో విడిపోవడానికి గల కారణాన్ని వివరిస్తున్నారని అంట న్నారుఅయితే అభిమా నులు ఇక్కడ గుర్తు పెట్టుకో వాల్సింది ఏంటంటే.. చైతన్య తన సినిమాలతో ఎవరో ఒకరిని టార్గెట్ చేసే మనస్తత్వం ఉన్న వ్యక్తి కాదు. రియల్ లైఫ్ లో అందరితో సౌమ్యంగా ఉంటూ తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోయే చై.. ఒక సినిమా డైలాగ్ తో సామ్ ని ఎందుకు టార్గెట్ చేస్తాడు.నాగచైతన్య - సమంత పరస్పర అంగీకారంతోనే విడాకులు తీసుకున్నారు. వారి మధ్య ఏమి జరిగిందనేది ఇరు వర్గాలకు మాత్రమే తెలుసు. 'బంగార్రాజు' ప్రమోషన్స్ లో డివోర్స్ పై చాలా పరిణతితో సమాధానమిచ్చారు. అలాంటి వ్యక్తి పగ పెంచుకుని ఒక డైలాగ్ తో సమంతను టార్గెట్ చేస్తున్నారనడం కరెక్ట్ కాదు.కాగా 'ఏమా య చేసావే' సినిమాలో కలిసి నటించిన నాగచైతన్య - సమంత ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే నాలుగేళ్ళ వైవాహిక జీవితానికి స్వస్తి పలుకుతూ 2021 అక్టోబర్ లో విడిపోతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం వేర్వేరు దారుల్లో పయనిస్తున్నారు.

# 50 కోట్ల హీరోయిన్.. ఎవరు పట్టించుకోరేంటి?

టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి ఏదైనా సినిమా ఓకే చేసింది అంటే తప్పకుండా ఆ సినిమాలో బలమైన కంటెంట్ ఉంటేనే ఆమె గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది అని ఇండస్ట్రీలో ఒక మంచి పేరు అయితే సంపాదించుకుంది. ఒక సినిమా కథ నచ్చకపోతే అందులో ఎంత పెద్ద స్టార్ హీరో ఉన్నా కూడా ఆమె లెక్క చేయదు అని కూడా ఒక క్లారిటీ వచ్చేసింది. ఆ మధ్య మెగాస్టార్ చిరంజీవి రీమేక్ సినిమాను కూడా ఆమె రిజెక్ట్ చేసిన విషయం తెలిసిందే.సాయి పల్లవి మొదట ఫిదా సినిమాతో పరిచయమైనప్పుడు కేవలం ఆమె క్రేజ్ ద్వారానే దాదాపు 50 కోట్ల బిజినెస్ చేసింది. ఆ సినిమాకు హీరో వరుణ్ తేజ్ అయినప్పటికీ కూడా ఎక్కువగా సాయి పల్లవి వెండితెరపై హైలెట్ గా నిలిచింది.అంతగా మంచి కరేజ్ అందుకున్న సాయి పల్లవి ఇప్పుడు మాత్రమే వరుస డిజాస్టర్లతో ఫామ్ కోల్పోయింది. కనీసం ఆమె సినిమా విడుదలవుతున్న హడావిడి కూడా కనిపించడం లేదు. రీసెంట్గా వచ్చిన విరాటపర్వం సినిమా ఎలాంటి రిజల్ట్ అందుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.ఇక ఇప్పుడు గార్గి అనే సినిమా విడుదలవుతున్న విషయం కూడా పెద్దగా ఎవరికి తెలియకపోవడం ఆశ్చర్యకరం. 50 కోట్ల బిజినెస్ చూసిన సాయి పల్లవి ఇప్పుడు మాత్రం రిలీజ్ సమయంలో కనీసం కొంత బజ్ కూడా క్రియేట్ చేయలేని పరిస్థితి ఏర్పడింది.



గార్గి సినిమా ట్రైలర్ చాలా ఎమోషనల్ గా విమర్శకుల ప్రశంసలను అందుకుంది. కానీ సినిమా పై సాయి పల్లవి హార్డ్ కోర్ ఫ్యాన్స్ కూడా పెద్దగా స్పందించడం లేదు.ఈనెల 15వ తారీఖున గార్గి సినిమా విడుదల కాబోతోంది. ప్రముఖుల ద్వారానే ఈ సినిమా ట్రైలర్ కూడా విడుదల చేయడం జరిగింది. అయినప్పటికీ కూడా ఓపెనింగ్స్ అందుకుంటుంది అని నమ్మకం కూడా లేదు. ఇక 14వ తేదీన రామ్ ది వారియర్ సినిమాకే అంతంత మాత్రం బజ్ ఉంది.ఇక సాయి పల్లవి సినిమాకు ఇంతవరకు క్రేజ్ అందుకోలేదు. సాయి పల్లవి థియేటర్ల కు రప్పించేంత కంటెంట్ తో రావడం లేదు అని ఆమె సెలెక్ట్ చేసుకుంటున్న కంటెంట్ ఈ మధ్య కాలంలో పూర్తిగా ఫెయిల్ అవుతున్నాయనే కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# గుజరాత్‌లో 'ఆట' రష్యా నుంచి డబ్బుల 'మూట'.. బయటపడ్డ ఫేక్ ఐపీఎల్ బండారం



గ్రౌండ్‌లో ఐపీఎల్ టీ20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. ఆటగాళ్లంతా మంచి ఉత్సాహంతో ఉన్నారు. ఓ వైపు బ్యాట్స్‌మన్ ఫోర్లు, సిక్సర్లు బాదుతుంటే.. మరో వైపు బౌలర్లు వికెట్లు పడగొట్టేస్తున్నారు.. లైవ్‌లో ప్రేక్షకులు ఊపిరిబిగపట్టుకుని చూస్తున్నారు. అటు మ్యాచ్‌లో ఏ ఓవర్‌లో ఎన్ని రన్స్ రావొచ్చన్న దాని నుంచి ఫోర్లు, సిక్సర్లు, ఔట్‌లు, ఎవరెంత స్కోర్ చేస్తారనే దాకా బెట్టింగ్‌ల మీద బెట్టింగ్‌లు సాగుతున్నాయి. క్రికెట్ అన్నాక ఇదంతా కామనే అంటారు కదా.. ఇందులో చివరన చెప్పిన బెట్టింగులు మాత్రమే నిజం. మిగతా అంతా ఉత్త ఫేక్! విదేశీయులతో బెట్టింగ్‌లు కాయించి డబ్బులు దండుకోవడానికి ఓ ముఠా ఏకంగా ఫేక్ ఐపీఎల్‌నే నడిపించింది. ఇటీవలే గుజరాత్ పోలీసులు ఈ ఫేక్ ఐపీఎల్ మ్యాచులు, బెట్టింగ్ దందాను బయటపెట్టారు. కొందరు గుజరాత్‌లోని మెహ్సానా పట్టణానికి కాస్త దూరంలోని మోలిపూర్ గ్రామంలో శ్మశానం పక్కన ఓ పొలాన్ని నెలవారీ అద్దెకు తీసుకున్నారు. దాన్ని చదును చేసి.. మధ్యలో పిచ్‌ను, ఇతర గుర్తులను సిద్ధం చేసి ఓ క్రికెట్ గ్రౌండ్‌లా మార్చారు. స్థానికంగా ఉన్న 25 మంది రైతులు, కూలీలకు రోజుకు రూ. నాలుగైదు వందలు ఇస్తామని చెప్పి క్రికెట్ ఆటగాళ్లుగా పెట్టుకున్నారు. అచ్చం ఐపీఎల్ టోర్నీలో వివిధ జట్లను పోలిన డ్రెస్‌లను వేయించి.. ఆయా జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతున్న ట్టుగా హడావుడి చేశారు.అంపైర్లను పెట్టి, వారికి వాకీటాకీలు ఇచ్చి.. నిజమైన మ్యాచ్‌ను తలపించేలా చేశారు. దీనంతటినీ అధునాతన కెమెరాలతో చిత్రీకరిస్తూ.. 'ఐపీఎల్' పేరిట క్రియేట్ చేసిన యూట్యూబ్‌లో చానల్‌లో లైవ్ ప్రసారం చేశారు. నిజమైన మ్యాచ్‌ల తరహాలో స్కోర్, బాల్స్, ఇతర గ్రాఫిక్స్‌ను పెట్టి.. నిజంగానే ఏదో పెద్ద ఆటగాళ్ల లైవ్ మ్యాచ్ అనిపించేలా జాగ్రత్త తీసుకున్నారు. ప్రేక్షకుల గోల, ఈలలు, చప్పట్లు వినిపించేలా సౌండ్‌ను ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని లైవ్‌కు యాడ్ చేశారు. ప్రఖ్యాత క్రికెట్ కామెంటేటర్ 'హర్ష భోగ్లే' వాయిస్‌ను పోలినట్టుగా ఓ వ్యక్తితో కామెంట్ కూడా చెప్పించారు.ముందే చెప్పుకున్నట్టు ఈ మ్యాచ్‌లు, ఆటగాళ్లు అంతా ఫేక్ అయినా.. ఇదంతా చేసింది మాత్రం బెట్టింగ్ కోసం. మన దేశం వాళ్లయితే ఆటగాళ్లను, మ్యాచ్‌ను ఇట్టే గుర్తుపట్టేస్తారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190